# అసంతృప్తి ఆనందం

[ కథానిక ]

'సన్యాసులు గుడిముందు ఓంకారధ్వనితో ప్రాణాహుతులు పుచ్చుకుంటూవుంటే ఏనాది చిన్నది గుడివెనక హాహారావంతో అన్నపూర్ణాదేవియొక్క విశీర్ణపత్రాల క్రింద మృతి(వారింది.'

రచయిత :

కవికొండల వెంకటరావు, బి. ఎల్.

రస్తా వెడల్పిచ్చింది. తుడిచే వాళ్లు సంఖ్యలో ఎక్కువైనారు. రస్తారాటు హెచ్చింది. తుడిచే వాళ్లు కొత్తగా దిగుమతి అయినారు. అయితే లోకంలో అసంతృప్తి! అది అలాగేవుంది. నడిచే వాళ్లు తుడిచేవాళ్ళతోను, తుడిచే వాళ్లు నడిచేవాళ్ళతోను ఎంతకలిసిపోతూవున్నా ఆదిసమస్య ఆది సమస్యగానే నిల్చివుంది.

ఆదిసమస్య అనగా ఆకలి సమస్య— 'శిశువు కేరుమనడంతోనే తల్లి అక్కునచేర్చుకు పాలు అందిచ్చేటట్టు అందఱియొక్క అందుబాటులోను భగవంతు 'డున్నాడు! ఉన్నాడు!' అని ప్రతి మతము ప్రతి మార్గదర్శి ప్రకాశమానంగా పలకడమేగాని పరీక్షయిచ్చిన వాడు వొక్కడూ లేడు. మనందఱికూవున్నా వాళ్ళకులేదు. వాళ్ళకు భగవంతుడూ లేడు, భగవత్ప్రవక్తా లేడు. ఆ యుభయం లేమి తో పాటు ఇహభయంలేదు పరభయం లేదు. కాని అహంజ్యోతి! అది ఎవనిలో వానికే ఆగుంపులో ఆ యుదయం తొణికిసలాడి పోతూ వుంది. ఈ తుడిచేది తాను ఈనడిచేది తాను అనే యేర్పాటు వేయి మందిలో వేయి ఆత్మలుగా విజృంభించి ఇసుక రేణువుల ఆధారాన్ని పరమాణువులై పైకి లేచిపోవడం నూతనభానూదయకాంతిలో విశదపడుతూవుంది.

* * *

'ఏనాది సిన్నిదాన్ని !
ఏటిమీద ఎనిమిదేండ్లు
పాటిమీద పాతికేండ్లు
పండబెడితె పచ్చగుంట
నిండబెడితె నీటుగుంట
కొప్పునిండ పూలుతురిమి
కొలువ గలనురా !
నిప్పుమధ్య నీతి మొలక
నిలపగలనురా !
చేరమాడి పోకురా
దూరమడిగి రాకురా
సొప్పుకో నా పేరు !
తప్పుకు పొయ్యేరు
ఎల్లాంటయ్యేరు
తెల్లటి దొరగారు.'

అని యొకచిన్నది పాడుతూ చీపురుతో రస్తా తుడుస్తూ చీపురు దుమ్ము—నడుస్తూ వస్తూ ఉన్న ఒకానొక జాతివాని ఛాతీమీదకు—చేటతో ఎత్తిపోసినట్టు పోసింది. ఆ జాతిదొర టోపీతీసుకు ముఖాన్ని చాటెట్టుకు తనను తప్పుకు పోయ్యేటట్టు చేసింది. అతి వోయ్యారంగా తన యీడుజోడు తుడుపుడుగాని కేసి చూసింది.

వాడు– ఆయీడు జోడు తుడుపుడుగాడు– ఆ సమయాన కేదో తన పాట యిలా పాడుతూ వూడుస్తూన్నాడు, పైదాని కేసి చూస్తూనే దాన్ని వింటూనే–

'కోరలమ్మకున్న మహిమ
పీరులమ్మ కున్నదే ?
హోరువానకున్న మెఱుపు
వొఱుపుబుగ్గి కున్నదే ?
బొమ్మలాటకున్న వెలుగు
సెమ్మఅట కున్నదే ?
అమ్మకైపు కున్న తెలివి
జిమ్మకైత కున్నదే ?'

అని పాడుతూ ఊదుస్తూ- తన దిశగా వస్తూవున్న ఓ సాహెబ్ గడ్డంలో చిక్కుపడేటట్టు- తట్టెడు చెత్త దారినడాన్ని జారపోశాడు. సాహేబు ఆ చెత్తనొక్క దాటు దాటి వాణ్ణి తప్పుకుపోయాడు. గడ్డంసాహేబు గంతు చూచి పక్కుననవ్వింది పిల్ల. మగవాడు ఈలవేశాడు. చిన్నది చిరునవ్వు నవ్వుతూ యీలగాని దగ్గరకువచ్చి యిలా ప్రస్తావించింది.

'పాలకేమి సత్తువుంది ?
నీళ్ళకుందిరా! — పేడ
నీళ్ళకుందిరా!...
పూలకేమి సత్తువుంది ?
రాలకుందిరా! — ప్రేలు
రాలకుందిరా! ...
ఈలకేమి సత్తువుంది ?
గాలికుందిరా ! — ఈసు
గాలికుందిరా! ...

* * *

ఆ ప్రస్తావన పరిసమాప్తి కాకుండానే వాళ్ళిద్దర్ని- ఆమాత్రం దూరాన్నుంచి- మోటార్ కారు ముందుసీటున కూర్చుని కమీషనర్ కనిపెట్టి—'తిండికి లేదంటూనే- అన్యోన్యం పరాసికాలాడుకుంటారు!- వీళ్ళను తక్షణం నవుకరీలోంచి తీసెయ్యండి' అని వెనక సీటులో కూర్చున్న ఆరోగ్యశాఖాధికారికి సలహాయిచ్చాడు.

ఆరోగ్యశాఖాధికారి 'చిత్తం! వీళ్లు, వాళ్ళల్లోవాళ్లు చేసికొనే చిలిపిచేష్టల్తోనే కాకుండా, హడ్సన్ దొరగారిమీద దుమ్ముపోసి, ఇమామ్‌సాహేబుగారిముందు చెత్త విడిచి అతి రౌడీలుగా ప్రవర్తించారట నేటియుదయం.' అని మరి కొన్ని నేరాలు గుదిగుచ్చాడు.

కమీషనర్ తక్షణం ఆఏనాది జోడు కాడ తనకారు ఆపి 'ఓసి! పిల్లా! నిన్నే! నీవు! ఇలారా! నిన్ను పనిచెయ్యడానికి పెట్టినామా ? ఇక్కడ నీ మగాడితోకూడి కన్ను గిలపడానికి పెట్టినామా?' అని అడిగాడు.

ఏనాది యువకుడు ఆరోగ్యశాఖాధికారికి నమస్కారము పెడుతూ బొంగువంపు అయిపోయినాడు.

చిన్నది ఏమన్నా తనచేతి చీపురక్కడ పడేసి 'వాడుచేస్తే చేసేను గాక యీచిల్లరసేవ- నేను చేయలేను! వాడు వంగితె వంగేనుగాక! నేను వంగలేను. నేను వందనం సేయలేను!' అని అంటూ ఓపాట వాళ్ళందఱిమీదకూ విసిరింది. ఓ పాట తనలో ముసురుకునేటట్టు చేసికొంది. ఎన్నిపాటలైనా చరణాలన్నే! పది !

'జారుపయట సర్దుకోను
జరుగుతుంటెగా ?
ఫీడు జుత్తువేసికోను
ప్రేళ్ళుపోతె గా?—
చేతి చీపురట్టియూడ్వ
మూతికి దుమ్ము
కుళ్ళుచెత్త యెత్తియూడ్వ
ముక్కుకు కంపు—
మనిషికసలు పుట్టినాన ?
ఘనసన్నది ఉన్నదేమ ?

అని గొంతెత్తి, గొంతుమార్చి, గొంతుదాచి- ఆగుంపును, ఆగోవాళ్ళను, ఆగోష్టిని, విడిచిపెట్టి ఇరవైగజాలు ఉత్తరపు తెఱపినే గస్తు నడక నడచింది.

* * *

అంతలో ఆమెకు వినిపించింది ఒకానొక రంగురంగుల బండి తన వైపునకు వస్తూవున్న చిరుగంటల యులివు. కనిపించాడు బండిలో కూడా ఓసన్యాసి.

నమస్కరించింది ఏనాదిచిన్నది ఆసన్యాసికి. సన్యాసి నమస్కారమందుకుంటూ 'నీ కేంపడవేయాలని వుందో పడవెయ్యి ఈ డబ్బీలో' అన్నాడు.

చిన్నది 'పడవేత ! పడవఏల!' అని వెకిలిగా నవ్వింది. ఆనవ్వుకు హడలిపోయి ఆ సన్యాసి ఆమె నుండి ఓరసిల్లి వంకరగా బండి నడుపుకు పోయేడు. వెంటపడింది. ఎన్ని వంకరలా బండి తిరిగిపోతూ ఉంటే అన్ని వంకరలు తానుకూడా తిరిగిపోతూ అన్నివంకరలూ తన పాటకు చేకూరుస్తూ యీలా పాడదొడగింది.

'కారునలుపు రాయిడెచ్చి
కన్ను చెక్కి- పన్ను చెక్కి-
వెన్ను చెక్కి- చెన్ను చెక్కి-
అన్నపూర్ణ అంచు దాని
నాదరింతురా ?

కన్నుకలిగి పన్నుకలిగి
వెన్నుకలిగి చెన్నుకలిగి
నలువచే నానెఱుకవయి
మ్రోగుచున్న నన్నుచూచి
యొత్తిగిలేరా ?

* * *

కూడాకూడా తిరిగింది కావడం చేత నాడాసన్యాసికికూడు ఎక్కడెక్కడ ఏలావీలా ఎంతెంత దొరికిందో కనిపెట్టకలిగింది.

ఇక గుడి అక్కడకు ఫర్లాంగు మేరలోవుంది, ఎదూరుగా కొండ మీద. వందమందికి పైగా 'అన్నపూర్ణ సన్యాసులు' కడపరాల పఱుపులెక్క అన్నంబండికోసం నిరీక్షిస్తూ ఉన్నారు. ఆ నిరీక్షణలోనే జేగంటమోగిస్తున్నారు. జతరుంజలు వాయిస్తున్నారు. 'మాతా! అన్నపూర్ణభవానీ!' అని హారతి వెలిగిస్తున్నారు.

బండి అంతకంతకు త్వరగా నడుస్తూ వుంది గుడివంకకు. బండితోనే సన్యాసి వెనక ముందులు చూడకుండా ఎద్దు ముక్కుతాడు ఘూడిస్తూ గ్రుడ్లనిప్పులు గురియిస్తున్నాడు.

ఏనాది చిన్నదాని కర్థంకావడంలేదు ఆదృశ్యం అంతా—దాని కర్థం అవుతూవున్నదల్లా సొంత కాలిమంట, సొంత కడుపుకాల్పు. మా అమ్మా! మాడపట్టు మట్ట మధ్యాహ్నమైయుంది.

* * *

గుడి అరుగులమీదను, గుడి ముందరి నంది యిరుచాయలను, నంది యీవలి ధ్వజస్తంభపు పొడుగు నీడను విస్తళ్ళువేసి, విస్తళ్ళల్లో షడ్రసోపేతంగా పదార్థాలు వడ్డించేస్తూ వున్నారు! కూర్చున్నారు కొదువలేకుండా ముసలి సన్యాసులు, కోదమసన్యాసులు, ప్రథమ సన్యాసులు, అధమ సన్యాసులు—కావి జోలె తగిలించుకున్న ప్రతీ ప్రాణికీ ఉంది ప్రవేశం ఆ ప్రాంగణంలోకి— ఇతరులకు లేదు.

ఇతరుల కది రహదారి కాదుఅని అతి నాగరీకంగా అతి నేవళీకంగా వ్రోవనున్న ఓ తాటిచెట్టుమీద చెక్కబడివుంది, చేవలోకంటూ.

మఱిన్ని నిరక్షరకుక్షుల కొరకా అన్నట్లు రెండు వేటకుక్కలు ఆచెట్టునే కట్టివేయబడి కనిపిస్తూ వున్నాయి; ఎవరైనాసరే అప్పటికప్పుడు కరవడానికి విడువబడే మహా స్వేచ్ఛ పుచ్ఛ వక్రతను వెల్లడిస్తున్నాయి కూడాను అవి.

ఆదాకా బోధ పడని దృశ్యము భయానకమైపోయింది ఏనాదిదానికి. 'అది రహదారి కాకపోతే ఏది తనకు రహదారి?' అనే ప్రశ్న ఆవరించివేస్తూవుంది ఆమెను. ఆ ప్రశ్న ఆవరిస్తూన్నకొద్దీ ఆమెకు తల తిరిగిపోసాగింది. తల తిరిగిపోతూవుంది అన్నసంగతి ఒకరితో వెంటనే వెళ్ళబోసికోవాలని వున్నా వినేవారేరీ?

'గుడి వెనక్కుపోయి ఉండు.' మన్నట్లు ఎదో సంజ్ఞ కనిపించింది. 'బండెడన్నము తోలుకు వచ్చి యింతమందికి కడుపునిండ బెడుతూన్నవాడు ఆ జగన్నాథుడు తన్ను మఱచిపోతాడా? నాయనా! నీ బండికూడా వచ్చినందుకేనో సంజ్ఞ చేసినావే?' అని గుడికి దూర దూరంగా నడుస్తూ గుడియొక్క వెనుకభాగానికి చేరుకుంది చిన్నది, ఆ వెఱ్ఱిది.

అక్కడ, కొండ ఎత్తుగా ఎగురుతూవున్న ఉదధి లోతుగా అణగారుతూవున్న, ఉగుటుతో అదురుతూవున్నా కుదురుతో ఐక్యమౌతూవున్న, ఎండుకులు, ఏనాటి ఆకులో గలగలమంటూ వున్నాయి. పైనున్న ఏచెట్టయినా రాల్చిన కారాకులేమో అని నీడ ఆశను పైకిచూచింది. కాని పిల్లకే చెట్టూ ఆ ఆకులమీదను కనుపించలేదు. కనిపించలేదు సరికదా ఆశకొద్దీ వేసిన అడుగు ఆకుల్లోకి దించుకుపోయి ఆ దురదృష్టవంతురాలి నలా ఓ పెద్ద కనబడని గోతిలోనికి దించివేసింది.

దించివేయక దిద్దితీరుస్తుందా? అదొక పాడునుయ్యి. నుయ్యిఎండిపోయినా మహామత్స్యాలకింకా నెలవు అనేవాడుక. నూతి అడుక్కి వెళ్ళిపోయింది ఏనాదిచిన్నది. వింటున్నారా? కథ!

* * *

...సన్యాసులు గుడిముందు

ఓంకారధ్వనితో ప్రాణాహుతులు పుచ్చుకుంటూవుంటే ఏనాది చిన్నది గుడివెనుక హాహారావంతో అన్నపూర్ణాదేవియొక్క విజీర్ణపత్రాల క్రింద మృతంవారింది. కేవలం దేవి విజీర్ణపత్రాలే అయితే అంతచేటు చేటువాటిల్లేది కాదేమో! ఆ ఆకులు మనుష్యసన్యాసుల నికృష్టోచ్ఛిష్టప్రేతాలు... ఈజీవి పడగానే ఆ ప్రేతాల్లోంచో ఆ ప్రాతనూతిలోంచో ఓ చెకుముకి రారాయిడి చెణుకు ఆవిర్భవించి వెంటనే ప్రచండాగ్నిజ్వాల నెత్తించింది. ఏదీ గుడి? ఏరీ సన్యాసులు? అన్నంతలో తగులడి పోయినారు!

ఎవరు అన్నంతలో? ఏనాది కోడెకాదు అన్నంతలో? ఏమని అన్నంతలో? 'ఏదీగుడి! ఏరీసన్యాసులు?' అని అన్నంతలో. అయినప్పటికిన్నీ ఆజ్వాల నింకా బయలుమీద కుసికోలుపుతూనే వున్నాడు వాడు. 'ఒరేయి! ఇదేంపనిరా! నీ భార్య యెక్కడుందిరా?' అని ఎవరైనా పరామర్శిస్తే

'పాటిమీద ఏరుతీస్తే
పడవకేమి లోటయా!
పాతికలో ఎనిమిదోతె
పదిహేడే కాదయా!

ఏక్కడో వోదిక్కున కాపడుతుంది.' అంటూ కృతి కపశ్రుతి నివారించేడు.

# కుష్ఠరోగంలో ఆవుపాల వాడకం

డాక్టరు సాంత్ర కుష్ఠవైద్యములో ప్రవీణుడు. ఆయన యభిప్రాయము ప్రమాణమైనది. అందుచే అయ్యది మన్నింపదగును. 15 ఏండ్లనాడు డాక్టరు సాంత్ర గ్రామములలో త్రిమ్మరి మాజిక్ లాంతరుతో కుష్ఠరోగముమీద మాటలాడుచు కుష్ఠునకును, పాలకునుగల సంబంధము తెలిపి గోరక్షణనుగురించి నొక్కివక్కాణించెను. దేవతగా భావించెడి గోవును నిర్లక్ష్యముచేసి, నిరాదరణసేయుటచే దైవము మనలను యీ కుష్ఠుజాడ్యముతో శిక్షించెనని చెప్పెను. అది భావోద్రేకముగా, లేక మతోన్మాదముగా కన్పడవచ్చును. గోరక్షణచే కుష్ఠురాదనినే ఋజువు చేయజాలను. కాని పాలవాడకంవలన కుష్ఠుతీవ్రత తగ్గునని సూచనలు కలవు. గతశతాబ్దములో అమృతసర్ జిల్లాలోని సితాలిని పట్టణములో సిక్కుబాబా కుష్ఠరోగనివారకుడని పేరొందెను. ఆ ప్రఖ్యాతి సర్కారుకు తెలిసి విచారణచేయించిరి. అమృతసర్ సర్కారువైద్యుడు వెళ్లిచూచి ఆ నివారణ నిజమేనని తెల్పెను దానికికారణము రహస్యపు చట్కాలుగాక అక్కడకువచ్చిన రోగులకు హెచ్చుగా ఆహారములో పాలువాడుటయే యని ఆయన కనిపెట్టెను.

భారతదేశములో కుష్ఠరోగనివారణ ప్రచార ప్రారంభకుడైన డాక్టర్ మూయర్ ప్రతికుష్ఠురోగి రోజుకి 2 శేర్లపాలు త్రాగవలెనని, అవి ఆవుపాలుగా నుండవలెనని తెలిపెను.

దక్షిణభారతములోని డాక్టరు కోక్రేను కనిపెట్టినదేమన తీవ్రకుష్ఠురోగముగల పిల్లలకు క్రొవ్వులేని పాలు వాడినపుడు జాడ్యపుతీవ్రత తగ్గునని. విదేశములనుండి తెప్పించిన పాలపొడికన్న ఇచ్చట దొరకిన పాలనే ఆయన వాడిన పక్షమున బాగుండెడిది.

ఏ విటమిన్ వలన కుష్ఠురోగులకు మేలు కలుగునని చెప్పబడెను. ఆవుపాలలో ఈ విటమిన్ ఏ హెచ్చుగానున్నది. పచ్చిగడ్డిమేయు ఆవుపాలలో మిక్కిలి హెచ్చు. కావున శాస్త్రరీత్యా ఋజువు ఇచ్చట దొరకుచున్నది. రోగతీవ్రత తగ్గినపుడు అది వ్యాపింపనేరదు. ఈనాడు గోవులకంటెకూడ కుష్ఠులను నిర్లక్ష్యము చేయుచున్నాము. గోవులవలె కుష్ఠులు నోరులేని వారుకారు. అయినను వారి మొరను వినిపించుకొనకున్నారు. భారతసభ్యతలో గోరక్షణవలనే కుష్ఠురోగి రక్షణకూడ ఒక అంతర్భాగము. ఇపుడుకూడ దేవఘర్ - జగన్నాథ దేవాలయములలో ధర్మకర్తలే కుష్ఠులకు అన్నమిడుచున్నారు. దక్షిణాదిలో దేవాలయాధికారులు యిట్లే చేయుచున్నారు. దేవాలయములవద్ద వీరి నివాసమునకు స్థలమిచ్చిరి. మనువు కాలమునుండి యిట్టి ఆచారము లేర్పడియుండును. కుష్ఠులు స్వగృహములవీడి పుణ్యక్షేత్రములలో నివసించవలెనని మనువు సలహాచెప్పెను. సేవాగ్రామ శాస్త్రిగారిని కలసి మన శాస్త్రములలో కుష్ఠునుగురించి వ్రాసిన వ్రాతలను పరిశోధించమంటిని. నేడు మనసభ్యత క్షీణించెనుగాని మరణించలేదు. దానిని పునరుద్ధరించినకొలది గోరక్షణ పెరుగును, కుష్ఠరోగము తరుగును. మనజాతీయాభివృద్ధి విధాన నిర్ణయ కార్యక్రమములో ఈరెంటికిని అవకాశ మేర్పరుప వలయును.

—గాంధి.

(గాంధిసందేశము)